# దిల్లీ విమానాశ్రయంలో టారిఫ్ పెంపునకు ఏఈఆర్ఏ అంగీకారం: జీఎంఆర్

దిల్లీ: దిల్లీ విమానాశ్రయంలో వినియోగదారుల అభివృద్ధి రుసుం (యూడీఎఫ్) పెంపు కోసం తీసుకొచ్చిన వేరియబుల్ టారిఫ్ ప్లాన్‌లో పలు అంశాలకు ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ (ఏఈఆర్ఏ) ఆమోదం తెలిపిందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ప్రకటించింది. 2029 మార్చి 31తో ముగిసే నాలుగో నియంత్రణ కాలవ్యవధికి ప్రస్తుత ఏరోనాటికల్ టారిఫ్‌ను దాదాపు 148% పెంచడానికి అంగీకరించింది. విమానాల్లో ఎకానమీ, బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు వేర్వేరుగా యూడీఎఫ్ వసూలు చేసేందుకు ఏఈఆర్ఏ అనుమతి ఇచ్చింది. దేశీయ ప్రయాణికుల నుంచి వసూలు చేసే యూడీఎఫ్‌లో మార్పులు చేయలేదు. అంతర్జాతీయ ప్రయాణికులకు యూడీఎఫ్‌ను పెంచారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2029 మార్చి 31 మధ్య నూతన టారిఫ్‌లు అమలయ్యేందుకు అంగీకారం వచ్చినా, వచ్చే నెల 16 నుంచి అమల్లోకి వస్తాయి. ప్రస్తుతం సగటు యూడీఎఫ్ రూ.145గా ఉండగా, ఇకపై రూ.360 అవుతుంది. దిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ అనుబంధ సంస్థ దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (డయల్) నిర్వహిస్తోంది.




**ఇండిగోకు రూ.944 కోట్ల జరిమానా నోటీసు**

డిగోపై రూ.944.20 కోట్ల జరిమానాను ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం విధించింది. ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ఈ పన్ను నోటీసులు అందుకుంది. 2021-22 మదింపు సంవత్సరానికి, రూ.944.20 కోట్ల జరిమానా చెల్లించాలని ఐటీ విభాగం నుంచి నోటీసులు వచ్చాయని ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో ఇండిగో తెలిపింది. ఇందుకోసం పేర్కొన్న అంశాలు పూర్తిగా అవాస్తవమని, వీటిని న్యాయపరంగా సవాలు చేయనున్నట్లు ఇండిగో వెల్లడించింది. కంపెనీ ఆర్థిక అంశాలు, కార్యకలాపాలు, ఇతర ప్రక్రియలపై ఈ ప్రభావం ఉండదని ఇండిగో స్పష్టం చేసింది.




# 2025-26లో భారత వృద్ధి 6.5%!

## ఈవై ఎకానమీ వాచ్ నివేదిక

దిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ 2025-26లో 6.5% వృద్ధితో సాగొచ్చని ఈవై నివేదిక వెల్లడించింది. ఎకానమీ వాచ్ మార్చి సంచికను సంస్థ విడుదల చేసింది. దీని ప్రకారం, 2024-25లో దేశ వాస్తవిక జీడీపీ వృద్ధి 6.4 శాతంగా నమోదు కావొచ్చు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇది 6.5 శాతానికి చేరొచ్చు.

జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) గత నెలలో విడుదల చేసిన సవరించిన గణాంకాల ప్రకారం, వాస్తవిక జీడీపీ వృద్ధి 2022-23లో 7.6%, 2023-24లో 9.2%, 2024-25లో 6.5 శాతంగా నమోదు కావొచ్చు. ఎన్ఎస్ఓ అంచనా ప్రకారం, 2024-25లో 6.5% వృద్ధి నమోదవ్వాలంటే, ప్రస్తుత జనవరి-మార్చి త్రైమాసికంలో 7.6% వృద్ధిరేటు ఉండాలి. ఇది సాధించాలంటే ప్రైవేటు తుది వినియోగ వ్యయం వృద్ధి 9.9 శాతం కావాలి. ఈ స్థాయిలో ఇటీవలి సంవత్సరాల్లో వృద్ధి నమోదు కాలేదని ఈవై తెలిపింది. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ మూలధన వ్యయం పెరగాల్సి ఉంది.ప్రభుత్వం విద్యపై చేస్తున్న వ్యయాలు ప్రస్తుతం జీడీపీలో 4.6 శాతంగా ఉండగా, 2048 నాటికి 6.5 శాతానికి పెంచాలని ఈవై నివేదిక సూచించింది. ఆరోగ్యంపై 2021లో జీడీపీలో 1.1 శాతానికి సమానమైన నిధులే ఖర్చు చేయగా, 2048 కల్లా దీన్ని 3.8 శాతానికి చేర్చాలని పేర్కొంది. జీడీపీలో ఆదాయ నిష్పత్తి ప్రస్తుతం 21% కాగా, దీన్ని 29 శాతానికి తీసుకెళ్లాలని తెలిపింది.

'దేశ మొత్తం జనాభాలో పని చేసే వయసు గలవారిని పెంచేలా నిర్మాణాత్మక మార్పులు తీసుకురావాలి.

ఉత్పాదకత కలిగిన ఉద్యోగావకాశాలు ఉంటే వృద్ధి, ఉపాధి, పొదుపు, పెట్టుబడులు అన్నీ పెరుగుతాయి. దీని కోసం ప్రభుత్వం ఆరోగ్యం, విద్య, మౌలిక వసతులపై వ్యయాలు పెంచాల'ని ఈవై ఇండియా చీఫ్ పాలసీ అడ్వైజర్ డీకే శ్రీవాత్సవ సూచించారు.

# 6 రోజుల్లో రూ.31,000 కోట్ల ఎఫ్‌పీఐ పెట్టుబడులు

దిల్లీ: గత 6 ట్రేడింగ్ రోజుల్లోనే విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐ), దేశీయ ఈక్విటీ




మార్కెట్లలో రూ.31,000 కోట్ల పెట్టుబడులు పెట్టారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ పెరగడం, ఇటీవలి భారీ నష్టాల నేపథ్యంలో.. షేర్ల విలువలు తక్కువ ధరల్లో లభించడం, దేశ స్థూల ఆర్థిక పరిస్థితులు మెరుగవ్వడం వల్ల ఎఫ్‌పీఐలు మళ్లీ మన మార్కెట్లలోకి వస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. ఇందువల్లే ఇటీవలి కనిష్ఠస్థాయుల నుంచి నిఫ్టీ సూచీ దాదాపు 6% రాణించిందని సమాచారం. ఫలితంగా మన మార్కెట్ల నుంచి మార్చిలో తరలిపోయిన విదేశీ పెట్టుబడుల నికర విలువ రూ.3,973 కోట్లకు పరిమితమైంది. జనవరిలో రూ.78,027 కోట్లు, ఫిబ్రవరిలో రూ.34,574 కోట్ల పెట్టుబడులను ఎఫ్‌పీఐలు నికరంగా ఉపసంహరించుకున్నారు. ఏప్రిల్ 2న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించే సుంకాల ఆధారంగానే ఎఫ్‌పీఐల తదుపరి పెట్టుబడి ధోరణి ఉంటుందని బ్రోకరేజీ సంస్థలు అంచనా వేస్తున్నాయి. భారత్‌కు ఏమాత్రం అనుకూలంగా ఉన్నా, ఎఫ్‌పీఐల పెట్టుబడులు కొనసాగుతాయనే పేర్కొంటున్నారు.



# ఖతార్ ఎనర్జీ నుంచి గెయిల్‌కు ఎల్ఎన్‌జీ సరఫరా ఏప్రిల్ నుంచి

దిల్లీ: ఖతార్ ఎనర్జీ ట్రేడింగ్‌తో చేసుకున్న ఒప్పందం మేర అయిదేళ్ల పాటు రావాల్సిన ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) సరఫరాలు ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభం కానున్నాయి. ఏడాదికి 12 కార్గోల చొప్పున, అయిదేళ్ల పాటు ఎల్ఎన్‌జీ మనకు చేరుతుందని ప్రభుత్వరంగ గ్యాస్ వినియోగ సంస్థ గెయిల్ ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ కుమార్ గుప్తా వెల్లడించారు. దీంతోపాటు వైటల్ ఏషియా సంస్థతో ఏడాదికి 10 లక్షల టన్నుల ఎల్ఎన్‌జీ పదేళ్లపాటు సరఫరా చేసేలా గెయిల్ చేసుకున్న ఒప్పందం 2026 నుంచి అమల్లోకి వస్తుంది. యూఏఈకి చెందిన అడ్నాక్ నుంచి ఏడాదికి 5 లక్షల టన్నుల ఎల్ఎన్‌జీ కూడా 2026 నుంచి పదేళ్ల పాటు సరఫరా కానుంది. ప్రస్తుతం ఇంధన అవసరాల్లో గ్యాస్‌వాటా 6-7% కాగా, 2030 నాటికి 15 శాతానికి చేర్చాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగానే ఈ ఒప్పందాలను గెయిల్ చేసుకుంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఏడాదికి 12 లక్షల టన్నుల చొప్పున 14 ఏళ్లపాటు అడ్నాక్ ఎల్ఎన్‌జీ నుంచి, ఏడాదికి 8 లక్షల టన్నుల చొప్పున పదేళ్ల పాటు టోటల్ ఎనర్జీస్ నుంచి ఎల్ఎన్‌జీ దిగుమతి చేసుకోనుంది.

# హెచ్.సి.యు. భూముల వేలాన్ని ఆపాలి.

## - పిడిఎస్ యు డిమాండ్, ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 31:**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయడాన్నీ విరమించుకోవాలని ఆందోళన చేసిన పిడిఎస్ యు, ఇతర విద్యార్థి నాయకులపై పోలీసుల దౌర్జన్యాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను గిరిరాజ్ కళాశాల ముందు సోమవారం దహనం చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ, 1973 సంవత్సరంలో ఆనాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ గారు హైదరాబాద్ నగరానికి జీవవైవిద్యంగా, హైదరాబాద్ ప్రజలకు ఆక్సిజన్ గా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉంటుందని ప్రకటించారన్నారు. కానీ ఈరోజు ఇందిరా గాంధీ ఆశయాలు కొనసాగిస్తున్నామని చెప్తూనే, హెచ్.సి.యు భూములను అమ్మకానికి పెట్టడం అన్యాయమన్నారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్ముకుంటుందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల భూములను అమ్ముకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని తెలియజేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ వైఖరిని విడనాడాలని హెచ్చరించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పిడిఎస్ యు అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి బీమ్ సేన్, ఇతర విద్యార్థి నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేసి, భేషరతుగా విడుదల చేయాలన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి అప్పగించిన 400 ఎకరాలను వెంటనే యూనివర్సిటీ పేరా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలన్నారు. విద్యా సంస్థల భూములను అమ్ముకునే వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలని, లేనిచో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు నాయకులు వరుణ్, సాయి, రాజు, నవీన్, రాకేష్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# బార్ అసోసియేషన్ అధ్యక్షునికి సన్మానం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 31:**



నూతనముగా జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గా ఏకగ్రివంగా ఎన్నికయినా మామిడ్ల సాయరెడ్డిని సోమవారం ఒలింపిక్ అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి తన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, సాయరెడ్డి సహృదయుడు, సౌమ్యుడు అని, మున్ముందు మరిన్ని పదవులు వరించాలని అన్నారు. అలాగే సేవా దృక్పతం తో సేవా కార్యక్రమలు చేపట్టాలని పేదలకు సేవా చేయాలని సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో బోర్గం గ్రామ బీఅర్ఎస్ అధ్యక్షులు ఈగ నర్సారెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గదారి సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ శిక్షణ తరగతులు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 31:**




అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందూరు విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ మాట్లాడుతూ, 1949 లో ఏబీవీపీ ఆవిర్భావం నుండి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా పాలిటెక్నిక్ ఉచిత బోధన తరగతిలో నిర్వహిస్తుందనీ తెలిపారు. గొప్ప అవకాశాన్ని ప్రతి విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం పరుచుకోవాలని అన్నారు. ఉచిత తరగతులు నిర్వహించే స్థలం ఎస్ఎస్ఆర్ జూనియర్ కాలేజ్, ఖలీల్ వాడి, నిజామాబాద్ అని తెలిపారు. రిజిస్ట్రేషన్ తేదీలు: ఏప్రిల్ 4 న రిజిస్ట్రేషన్స్ స్థలం: ఏబీవీపీ ఆఫీస్ ప్రగతి నగర్, సంప్రదించాల్సిన నంబర్లు: 73967 99671, 9390219504. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి బాల కృష్ణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరేందర్ కంటేశ్వర్ జోనల్ ఇన్చార్జ్ దుర్గా దాస్, రంజిత్, అభినవ్, ఇంద్రసేన, జయేంద్ర, వర్ధన్ అలంకార్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## రెండురోజులు తేలికపాటి వర్షాలు

**హైదరాబాద్**

రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం బయటకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని ముచ్చట చెప్పింది. రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని తెలిపింది. మంగళవారం రాత్రి నుంచి ఏప్రిల్ 3 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వాన పడే అవకాశం ఉందని వెల్లడించింది. భూ ఉపరితలం వేడెక్కడంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఏప్రిల్ 4న వర్ష ప్రభావం తక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఏప్రిల్ 2, 3 తేదీల్లో పగటి ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

## హెచ్‌సీయూ వర్సిటీ వద్ద భారీ బందోబస్తు

**హైదరాబాద్:** విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద సెక్యూరిటీ పెంచారు. యూనివర్శిటీ లోపల బయట భారీగా పోలీసుల మోహరించారు. వర్సిటీ భూములను చదును చేయడాన్ని ఆపాలంటూ విద్యార్థులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో పోలీసులు భద్రతను పెంచారు. యూనివర్సిటీలోని 400 ఎకరాలను బుల్డోజర్ లతో చదును చేసేందుకు యత్నించడంతో విద్యార్థి సంఘాలు, యూనివర్సిటీ సిబ్బంది భగ్గుమన్నాయి. యూనివర్సిటీ భూములను చదును చేయడాన్ని ఆపాలంటూ స్టూడెంట్స్ గళమెత్తారు. దీంతో నిన్న రాత్రి యూనివర్శిటీ పరిసరాలు రణ రంగంగా మారాయి. రాత్రి యూనివర్శిటీ వద్ద ఉద్రిక్తత నేపథ్యంలో పలువురు విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన విద్యార్థులను, విద్యార్థి నేతలను రాత్రి 10 తర్వాత విడుదల చేశారు. సోమవారం కూడా ఆందోళనలు కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసులు అలెర్ట్ అయ్యారు. హెచ్‌సీయూ వద్ద పోలీసులు భద్రతను కొనసాగిస్తున్నారు. యూనివర్సిటీకి సంబంధించిన ప్రధాన ద్వారంతో పాటు సెంట్రల్ యూనివర్సిటీ లోపల కూడా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే యూనివర్సిటీకి సంబంధించిన భూములను ప్రభుత్వం వేలం వేసే ప్రయత్నం చేస్తోందంటూ వర్సిటీకి చెందిన విద్యార్థులు, సిబ్బంది పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. గత రాత్రి విద్యార్థుల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి.. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

